ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నగరవ్యాప్తంగా పార్టీ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోనియా గాంధీ ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొచ్చి సోనియాగాంధీ రుణం తీర్చుకున్నారని చెప్పారు.

- సాక్షి నెట్‌వర్క్


కాంగ్రెస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో సోనియా జన్మదిన వేడుకలు


కేయూ మొదటి గేట్ వద్ద కేక్ కట్ చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు


కోర్టు గేట్ ఎదుట కేక్ కట్ చేస్తున్న లీగల్ సెల్ ప్రతినిధులు


కాజీపేటలో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ కార్యకర్తలు


పోచమ్మమైదాన్ జంక్షన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న మీసాల ప్రకాశ్


ఏకశిలానగర్‌లో మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, తదితరులు


గోపాలపూర్ కల్లు మండువా జంక్షన్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు


మడికొండ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న జంగా రాఘవరెడ్డి, తదితరులు


హసన్‌పర్తిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


చింతల్ బ్రిడ్జి వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


అనాథాశ్రమంలో సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి


వరంగల్ స్టేషన్ రోడ్డులో అన్నదానం చేస్తున్న నాయకులు నూనె రవి, రాజు


హనుమకొండ అదాలత్ ఎదుట కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

'హరీశ్‌వి దిగజారుడు వ్యాఖ్యలు'

హన్మకొండ అర్బన్: బీఆర్‌ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేస్తున్నవి దిగజారుడు వ్యాఖ్యలని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొల్లు రమేష్‌కుమార్ ముదిరాజ్ విమర్శించారు. హరీశ్ వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పట్టుమని 48గంటలు కాకముందు రైతుబంధు, మద్దతుధర అంటూ హడావిడి చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్లనే ప్రజలు కర్రుకాల్చి బీఆర్‌ఎస్‌కు వాతపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దేశాన్ని ఏలిన చరిత్ర ఉందని గుర్తుచేశారు.

నిట్ ఉద్యోగి మృతి

కాజీపేట రూరల్: నిట్‌లో సీనియర్ కేర్ టేకర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి, కాజీపేట దర్గా శాంతినగర్‌కు చెందిన మంతుర్తి చేరాలు (55) అనారోగ్య సమస్యల బాధపడుతూ శనివారం మృతి చెందారు. నిట్ ఉద్యోగ సంఘాల నాయకులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నిట్‌లో చేరాలు విధులు నిర్వహిస్తుండగా 2012లో ప్రమాదవశాత్తు గోడమీద నుంచి కిందపడ్డారు. కొంతకాలం తర్వాత క్రమక్రమంగా అతని ఆరోగ్యం క్షీణించి స్పృహ, మతిస్థిమితం కోల్పోయారు. ఈమేరకు శనివారం మృతి చెందారు. చేరాలు మృతదేహాన్ని నిట్ శానిటరీ రిటైర్డ్ సూపర్‌వైజర్, టీడీపీ వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బర్ల యాకూబ్, నిట్ ఉద్యోగ సంఘాల నాయకులు తాళ్ల పోశాలు, అజీజ్‌ఖాన్, ఆకుల కుమారస్వామి సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చేరాలు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అరుదైన శస్త్ర చికిత్స



హన్మకొండ: హనుమకొండలోని వేయి స్తంభాల గుడి ఎదురుగా ఉన్న శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. ఈమేరకు ఆపరేషన్ వివరాలను ఆస్పత్రి చైర్మన్, యురాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన అలుగు లింగయ్యకు ఒక కిడ్నీ మాత్రమే ఉందని, ఆ కిడ్నీలో 90ఎంఎం పరిమాణంలో రాయి ఉండడంతో తీవ్ర నొప్పితో బాధపడేవారని తెలిపారు. అనేక ఆస్పత్రులను సంప్రదించినా సరైన వైద్య అందకపోవడంతో శ్రీనివాస కిడ్నీ సెంటర్‌ను సంప్రదించారని తెలిపారు. ఉన్న ఒక్క కిడ్నీ ఫెయిల్ అయ్యే సమయంలో తమ ఆస్పత్రికి వచ్చారని, మల్టీ ట్రాక్ట్ పీసీఎన్‌ఎల్ విధానంలో ఆపరేషన్ పూర్తి చేసినట్లు రాంప్రసాద్ తెలిపారు. ఎలాంటి కోత, రక్తస్రావం లేకుండా ఆపరేషన్ చేసినట్లు వివరించారు. వారం రోజుల్లో రోగి పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. కాగా, ఈ ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో తనతో పాటు అనస్తీషియన్ డాక్టర్ సామ్రాట్, డాక్టర్ ఉపేంద్ర, డాక్టర్ ఆకాశ్ పాల్గొన్నారని తెలిపారు.

అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకెళ్లాలి

ఎల్కతుర్తి: మండల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీపీ జక్కుల అనిత అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ముల్కనూర్ సర్పంచ్ మాడుగుల కొమురయ్య కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకీభవించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుశీల నివేదిక చదివి వినిపిస్తుండగా మల్లారం సర్పంచ్ గుడెల్లి రాజిరెడ్డి కలుగజేసుకుని అంగన్‌వాడీ సెంటర్లను నెలకోసారి విజిట్ చేసి సమస్యలు అడిగి తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. మండల వ్యవసాయ అధికారి అబ్జల్‌పాషా నివేదిక చదివి వినిపిస్తుండగా రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదని ప్రశ్నించారు. ఆయిల్‌ఫాం సాగుచేస్తున్న రైతులు డ్రిప్ పైపుల కోసం దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీ ద్వారా పైపులు అందజేస్తామని ఉద్యానవన శాఖ అధికారి మానస వెల్లడించారు. జీపీల్లో ఉన్న నిధులు విద్యుత్ బకాయిలు కట్టేందుకే సరిపోతున్నాయని, అభివృద్ధి చేసేందుకు సరిపోవడం లేదని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

గోకుల్‌నగర్‌లో రక్తదానం


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న సంపత్ యాదవ్, తదితరులు

హన్మకొండ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ హనుమకొండ బ్లాక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని గోకుల్ కూడలిలో రెడ్ క్రాస్ సహాయంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ పార్టీ హనుమకొండ బ్లాక్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, సీనియర్ నాయకుడు నాయిని లక్ష్మా రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, బంక సతీష్, సుధాకర్, చంద్రశేఖర్, మురళి, అనిల్, కనుకయ్య, మేరి, లలిత, కవిత, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖుస్రూపాషాను కలిసిన టీఎంజేఏసీ


పీఠాధిపతి ఖుస్రూపాషాను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

న్యూశాయంపేట: కాంగ్రెస్ మైనార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, పీఠాధిపతి ఖుస్రూపాషాను తెలంగాణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ముస్లిం జేఏసీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ రాజ్ మొహమ్మద్, తహసీర్, ఖాలిక్ తన్వీర్, ఆరిపొద్దీన్, నూరొద్దీన్, నదీమ్‌బేగ్, నవీద్, అబూబకర్, హసన్, పూర్ణచందర్, ముఖీద్, షఫీయొద్దీన్, మహమూద్‌పాషా, సమీనా, ముషైద్ తైసీర్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ ప్లేట్ల తయారీ యంత్రం అందజేత


యంత్రాన్ని ప్రారంభిస్తున్న మురళీధర్, శ్రవణ్, సునీల్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా – భట్టుపల్లికి వెళ్లే దారిలోని మదర్ ఫౌండేషన్ అనాథాశ్రమానికి జిల్లా చారిటబుల్ ట్రస్ట్ (యూఎస్‌ఏ) రూ.లక్ష విలువ చేసే పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ప్రవాస భారతీయుడు శనివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కన్సల్టెన్సీ యజమాని వాసిర్ల మురళీధర్‌రావు, సుధా ప్లాస్టిక్స్ యజమాని శ్రవణ్ హాజరై యంత్రాన్ని ప్రారంభించారు. అమెరికాలో నివాసం ఉంటున్న ఎక్సైజ్ కాలనీకి చెందిన జిల్లా సునీల్ – మాధవి దంపతులు తమ కుమార్తె రాణి సుమేధ పేరు మీద యంత్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సంతోష్, సామాజిక కార్యకర్తలు రాధాకృష్ణ, హేమంత్ రెడ్డి, బోయచందు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో తపాలా ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి


ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: తపాలా ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు కోరారు. హనుమకొండ న్యూశాయంపేటలోని స్వగృహంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్‌ను సంఘం నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో తమ న్యాయమైన డిమాండ్లపై చర్చించాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనం, కనీస సౌకర్యాలు కేంద్రం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

మెట్టుగుట్టపై కార్తీక మాస పూజలు


మెట్టుగుట్టపై ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు

మడికొండ: 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి శనివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారికి ప్రభాతసేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం హరిహరులకు వైభవంగా ఆకాశ దీపోత్సవం, శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కాగా, రెండవ ఆదివారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి శేషు భారతి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది, భాస్కర్, రాజమ్మ, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖకు శుభాకాంక్షలు

ఖిలా వరంగల్: రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొండా సురేఖను మున్నూరు కాపు సంఘం ప్రతినిధి గజ్జెల శ్యామ్, సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల హామీలు నెరవేర్చి ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే ప్రభాకర్, సాగర్ల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నాం


హర్షాతిరేకాలు చేస్తున్న ఉద్యమకారులు

కేయూ క్యాంపస్: ఉద్యమకారులకు అండగా ఉంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో శనివారం ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపించడంలో ఉద్యమకారులు, నిరుద్యోగులది కీలక పాత్ర అని అన్నారు. ఉత్తరాఖండ్ తరహాలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం సారయ్య, ఉద్యమకారులు డాక్టర్ సూత్రపు అనిల్, గుండెటి సుమన్, మహ్మద్ మహబూబ్ పాషా, పున్నం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాలధారులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని కాశీరాజు ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. పోల ఉమామహేశ్వర్ గురుస్వామి నేతృత్వంలో పద్దెనిమిది మెట్లపై గణపతి, మహాలక్ష్మి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యారణ్యపురి కాలనీలో..

హసన్‌పర్తి: గోపాలపురం విద్యారణ్యపురి కాలనీలోని సంస్కృతి రెసిడెన్సీలో అయ్యప్ప పడిపూజను శనివారం నిర్వహించారు. 18 మెట్లతో పడి ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చిట్టిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెరుమాండ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఆకట్టుకున్న నరసింహావతార నాటకం


నాటక ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు


కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం చిన్నారులు నరసింహావతారం నృత్య రూపక ప్రదర్శన ఇచ్చారు. నాట్య కళామందిర్ శిష్య బృందం నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. హిరణ్య కశ్యపుడి మరణం, లక్ష్మీనరసింహుడి కల్యాణ నాట్యరూపకం ఆద్యంతం అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులను ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సన్మానించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పాల్గొన్నారు.

ఐదు సూత్రాలు అనుసరిస్తే విజయం


మెడల్ అందుకుంటున్న విద్యార్థి

హసన్‌పర్తి: విశ్వాసం, నమ్మకం, నిబద్ధత, కమ్యూనికేషన్, నిరంతర అభ్యాసం అనే ఐదు సూత్రాలు అనుసరిస్తే విజయం తథ్యమని ఎల్ఐటీ మైండ్ ట్రీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ అమర్‌నాథ్ తెలిపారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో (2018 – 2023) 39, 40వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలకు చెందిన 28 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అమర్‌నాథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతికతతో వేగవంతమైన అభివృద్ధి ద్వారా కార్పొరేట్ రంగాల నియంత్రణ, చలనశీలత సులభతరం చేయబడినట్లు చెప్పారు. విద్యార్థులు నిరంతరం పఠనం చేస్తూ ఉండాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా యువ గ్రాడ్యుయేట్లు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు సమాజ నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



హన్మకొండ: హనుమకొండలోని 7వ డివిజన్ పరిధిలోని కంచరకుంటలో రూ.65 లక్షల నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సెయింట్ పాల్ హైస్కూల్ చైర్మన్ ఆనంద్‌మోజెస్, నిర్మల, రాజశేఖర్, నర్సింగ్, రాజ్‌కుమార్, సుదర్శన్, విజయ, రమాదేవి, రమ, పద్మ, ఫయాజ్, సలీం, బోటు, జలీల్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

శాయంపేట: పంట పొలాల్లో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. మండలంలోని కాట్రపల్లి, సాధోనిపల్లి గ్రామాల్లో విషపూరిత పురుగు మందుల వినియోగంపై ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోనోక్రోటోపాస్, ట్రైజోఫస్, కార్బనిజం లాంటి విషపూరితమైన పురుగు మందులను నిషేధించాయని ప్రియాంకరెడ్డి గుర్తుచేశారు.